

సీహెచ్‌సీలో మౌలిక వసతులు

యలమంచిలి సీహెచ్‌సీలో వసతులు మెరుగుపరుస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి చెప్పారు. 8లో



అథ్లెట్ జ్యోతికి స్వర్ణం

విశాఖ: అథ్లెట్ జ్యోతి భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది.

వర్ష సూచన

అనకాపల్లి టౌన్: రాగల ఐదు రోజులు వర్షసూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం పేర్కొన్నారు. 18,19, 20న 2 మి.మి.,21న 12 మి.మి. చొప్పున వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. 40 నుంచి 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత, గాలిలో తేమ శాతం 77 నుంచి 81, గాలి గంటకు 8 నుంచి 9 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నేడు

అనకాపల్లి టౌన్: జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్లో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.సుజాతలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి ఈ ఏడాది పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలను, ధ్రువపత్రాలను అందిస్తారు.

చివరి దశకు రైల్వే ట్రాక్ మరమ్మతులు



ట్రాక్‌పై మరమ్మతు పనులు చేస్తున్న రైల్వే ఉద్యోగులు

అనకాపల్లి టౌన్: రాజుపాలెం రైల్వేగేటు సమీపంలో ట్రాక్ మరమ్మతు పనులు కొలిక్కివస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున గూడ్స్ రైలు పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. విశాఖ నుంచి విజయవాడ వెళ్లే ట్రాక్‌లో ఈ ఘటన జరిగింది. మరమ్మతులు చేయడంతో ఈ ట్రాక్‌పై నుంచి శుక్రవారం నెమ్మదిగా రైళ్ల రాకపోకలు ప్రారంభించాయి. రాజుపాలెం రైల్వేగేటు నుంచి తాడి రైల్వే స్టేషన్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర 100మంది సిబ్బందితో 10 జేసీబీలు, ఒక 200 జేసీబీ మిషన్‌తో పనులు చేస్తున్నారు. శనివారం ఉదయానికి పనులు పూర్తవుతాయని రైల్వే ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

నిలకడగా 'పెద్దేరు' నీటిమట్టం

- ఖరీఫ్‌కు ఢోకా లేదంటున్న అధికారులు



మాడుగుల: మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయంలోకి మండే ఎండల కారణంగా వారం రోజుల నుంచి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 133.5 మీటర్లకు తగ్గిపోయింది. పెద్దేరు ఆయకట్టు భూముల్లో ఖరీఫ్ పంటలకు ఈ నీరు సరిపోతుందని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే రైతులు ఆయకట్టు భూములలో వరి నారుమడులకు దుక్కులు చేస్తున్నారు. ఖరీఫ్‌కు అవసరమైన వరి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధం చేశారు.

అప్పన్న సన్నిధిలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి అప్పన్న జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తారా వితస్త గంజు దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. వేద ఆశీర్వచనం అందించారు. న్యాయమూర్తికి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను ఏఈవో నరసింహరాజు అందజేశారు.

డ్రోన్ టెక్నాలజీలో ఉపాధి అవకాశాలు

మురళీనగర్: విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ శిక్షణ ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అన్నారు. ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ టెక్నాలజీపై కాలేజీ వివిధ బ్రాంచీల డిపార్టుమెంట్ హెడ్‌లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సులో చేరడానికి ఆసక్తి చూపే విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీలో సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించడానికి ఏయూ ఐసీడీటీ ముందుకు వచ్చినట్లు చెప్పారు.



పదేళ్ల సమస్య.. పరిష్కారం

పదేళ్లుగా మా కాలనీలో సిమెంట్ రోడ్డు వేస్తామన్నారు. వెయ్యనేలేదు. వర్షం పడితే చాలు కాలనీ అంతా బురదమయం. రెండు నెలల క్రితం డిప్యూటీ సీఎం మా ఊర్లో 'గడప గడపకు' కార్యక్రమానికి వచ్చారు. ఆయనకు సమస్యపై మొరపెట్టుకున్నాం. రెండు నెలల వ్యవధిలోనే సీసీ రోడ్డు, మంచినీటి బోర్లు వేయించారు. డ్రైనేజీ పనులు కూడా చేస్తున్నారు. వీటితో పాటుగా వాటర్ ట్యాంక్ కలిప్పించాలని, కల్యాణమండపం కూడా ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎంను కోరాం. హామీ ఇచ్చారు. త్వరలో చేస్తామన్నారు. ఆనందంగా ఉంది.

– కోడూరు చిలుకమ్మ, గృహిణి, మాడుగుల గ్రామం



నెల వ్యవధిలోనే మంచినీటి బోరు

మా గ్రామంలో రెండు నెలల క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మా కాలనీలో తాగునీటి సమస్య ఉంది. ఒక మంచినీటి బోరు వేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేయ పెట్ల ఉమాశంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్లాం. నెల రోజుల వ్యవధిలోనే మా కాలనీలో మంచినీటి బోర్ వేశారు. డ్రైనేజీ పనులను ఈ నెలాఖరులో చేపడతామని అధికారులు చెప్పారు. ఇంత వేగంగా మా సమస్యల్ని పరిష్కరించిన ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడూ చూడలేదు.

– కొలన వరలక్ష్మి, ఎనబై కాలనీ, గొలగొండ పంచాయతీ



విద్యుత్ సమస్య పరిష్కారం అయింది

ఫిబ్రవరి నెలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మా గ్రామంలో ఏడాదిగా లోవోల్టేజ్ సమస్య ఉంది. దీన్ని డిప్యూటీ సీఎం దృష్టి తీసుకెళ్లాం. విద్యుత్తు అధికారులు ఏప్రిల్ నెలాఖరులోపే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేశారు. వాటితో పాటు వీధిలైట్లు, పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. ఇపుడు మా గ్రామంలో విద్యుత్ సమస్యలేదు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో మా గ్రామ సమస్య పూర్తిగా తీరింది.

– చల్లా సురేష్, రైతు, చొడువాడ గ్రామం

గడప గడపకూ ప్రగతి

- ఎమ్మెల్యేల పర్యటనలో సమస్యల గుర్తింపు
- జిల్లాలో 1242 పనులు అప్‌లోడింగ్
- 1173 పనులకు రూ.235.6 కోట్లు మంజూరు
- ఇప్పటికే 209 పనులు పూర్తి, మిగిలినవి వివిధ దశలో..

నియోజకవర్గాల వారీగా ప్రాధాన్యతా పనులు

నియోజకవర్గం	అప్‌లోడ్ చేసిన పనులు	మంజూరైన పనులు	పురోగతిలో ఉన్న పనులు	మంజూరు (రూ.కోట్లలో)
యలమంచిలి	334	227	245	9.98
నర్సీపట్నం	243	243	221	8.79
పాయకరావుపేట	226	218	200	8.53
చోడవరం	235	209	189	7.17
మాడుగుల	121	121	114	5.20
పెందుర్తి	78	74	64	2.80
అనకాపల్లి	43	31	23	2.00
మొత్తం	1280	1173	656	44.6

సాక్షి, అనకాపల్లి : ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలను చేర్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గ్రామ గ్రామాల్లో విజయవంతంగా సాగుతోంది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లి ఈ నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబం పొందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తున్నారు. పథకాల అమల్లో లోటుపాట్లను ఆరా తీస్తున్నారు. స్థానిక సమస్యల్ని తెలుసుకుని తక్షణ పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఎక్కడికక్కడ జనంతో మమేకమై వారి అభిమానాన్ని చూరగొంటున్నారు.

సమస్య చెప్తే చాలు..

కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను నమోదు చేసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. సమస్య తమ దృష్టికి రాగానే సంబంధిత విభాగ సిబ్బందికి చెప్తున్నారు. వారు సమస్య ప్రాధాన్యతను బట్టి అంచనాలు సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి పంపుతున్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆమోదంతో వెంటనే పరిష్కార చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఇంటి గడపకు వెళుతూ.. ప్రజల కష్ట సుఖాల్లో భాగస్వాములు కావడమే కాకుండా సంక్షేమ ఫలాల ప్రగతిని తెలుసుకుంటున్నారు.

శరవేగంగా పనులు

రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రథమ ప్రాధాన్యమిస్తోంది. ప్రతి సచివాలయ పరిధిలో ప్రజాప్రతినిధులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసిన అనంతరం.. రూ.20 లక్షల వరకు అభివృద్ధి పనులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. వీటి ప్రకారం జిల్లాలో 1280 పనులు అప్‌లోడ్ చేయగా... వాటిలో 1173 పనులు మంజూరయ్యాయి. 209 పనులు పూర్తయ్యాయి. 656 పనులు పురోగతిలో ఉన్నాయి. మరికొన్ని ప్రారంభం కావలసి ఉంది.



మాడుగుల హైస్కూల్ కాలనీలో వేసిన సీసీ రోడ్డు



కె.కోటపాడు మండలంలో విద్యుత్ పనులు

త్వరితగతిన చర్యలు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి శరవేగంగా చర్యలు తీసుకుంటున్నాం. అభివృద్ధి పనులు, మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయి. మిగిలిన పనులకు వెంటనే టెండర్లు పిలిచి పూర్తి చేస్తున్నాం. చిన్న చిన్న సమస్యలు అయితే వారం రోజుల్లోనే పరిష్కరిస్తున్నాం. .

– రవి పట్టాన్‌శెట్టి, కలెక్టర్

థాంక్యూ సీఎం సార్



నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

- క్రమబద్ధీకరించినందుకు మెడికల్ ఉద్యోగుల పాలాభిషేకం

గొలుగొండ: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితకాలం రుణపడి ఉంటామని కాంట్రాక్టు మెడికల్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. తమను రెగ్యులరైజ్ చేసినందుకు థాంక్యూ సీఎం సార్.. అంటూ చీడిగుమ్మలలో శుక్రవారం భారీగా నినాదాలు చేశారు. నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించి, సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగి ఈశ్వరరావు మాట్లాడుతూ 23 సంవత్సరాల నుంచి మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నామని, ఏ ముఖ్యమంత్రి చేయలేని పనిని జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారని, చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ సీఎం ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటారని తెలిపారు. రెగ్యులర్ అయిన ఉద్యోగులు ప్రజలకు మంచి సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారితోపాటు గొలుగొండ, చీడిగుమ్మల పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పూరి రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): పూరిలో జరగనున్న రథయాత్ర సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ –పూరి–విశాఖ మధ్య పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు విశాఖ–పూరి (08901) స్పెషల్ విశాఖలో ఈ నెల 19, 27తేదీలలో మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు (అదేరోజు మధ్యరాత్రి) 1.15 గంటలకు పూరి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరి–విశాఖ (08902) స్పెషల్ పూరిలో ఈ నెల 20,28 తేదీలలో రాత్రి 10.55గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.30గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు సింహాచలం, పెందుర్తి, కొత్తవలస, కంటకాపల్లి, అలమండ, కోరుకొండ, విజయనగరం, నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, సిగడాం, పొందూరు, దూసి, శ్రీకాకుళం రోడ్, ఉర్లాం, తిలారు, కోటబొమ్మాళి, నౌపడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, బ్రహ్మపూర్, చత్రపూర్, ఖల్లికోట్, బలుగాం, నిరాకాపూర్, హరిపురం, మోటారి, కనాస్ రోడ్ పీహెచ్, డేలాంగ్, జెనాపూర్ రోడ్ పీహెచ్, బీర్‌పురుషోత్తం పూర్, సఖిగోపాల్, జనకిదైపూర్ పీహెచ్, మలతిపత్‌పూర్ స్టేషన్‌లలో ఆగుతాయి. 1–థర్డ్ ఏసీ, 3–స్లీపర్ క్లాస్, 10 –జనరల్ సెకండ్ క్లాస్, 2–లగేజి కం బ్రేక్ /దివ్యాంగ కోచ్‌లతో నడుస్తాయి.

వ్యవసాయంలో యాంత్రీకరణతో అధిక దిగుబడి



వ్యవసాయ పరికరాలను రైతులకు అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- జి.అగ్రహారంలో వ్యవసాయ పనిముట్ల పంపిణీ

మాడుగుల రూరల్ : వ్యవసాయ సాగులో ఆధునిక యంత్రాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పథకం(పీఎంకేఎస్‌వై)లో భాగంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డీడబ్ల్యూఎంఏ) ఆధ్వర్యంలో జి.అగ్రహారం గ్రామంలో శుక్రవారం రైతులకు వ్యవసాయ సంబంధిత పనిముట్లను పంపిణీ చేశారు. డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఇ.సందీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వ్యవసాయం అంటే పండగ అని చాటి చెప్పి, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతన్నకు అందిస్తున్న సేవలను వివరించారు. గొలుగొండ మండలానికి చెందిన రైతులకు ఆయిల్ ఇంజిన్లు, తార్పన్లు, పైపులు, డ్రమ్‌సెట్లు, స్ప్రేయర్లను అందించారు. పీడీ సందీప్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీ రైతులకు 80 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నామన్నారు. జిల్లాలోని రెండు మండలాల్లో ఈ పనిముట్ల పంపిణీ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీనివాసరావు, స్థానిక ఏపీవో నవర వరహాలబాబు, టెక్నికల్ సహాయకులు దాడి జగదీష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రైడే!



ఎండలో ఐస్ ఫ్రూట్ తింటూ ఇంటికి వెళుతున్న విద్యార్థులు



మండుటెండలో గొడుగు నీడలో ద్విచక్రవాహనంపై ప్రయాణం



అనకాపల్లిలో తహసీల్దార్ కార్యాలయం రహదారి

- అట్టుడికిన అనకాపల్లి జిల్లా
- జిల్లా కేంద్రంలో 46.1 డిగ్రీలు నమోదు
- ఈ వేసవిలో ఇదే అత్యధికం
- నేడు మరింత తీవ్ర వడగాడ్పులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

సాక్షి, విశాఖపట్నం/అనకాపల్లి టౌన్: జిల్లాలో ఉష్ణతాపం రికార్డులు సృష్టిస్తోంది. మూడు వారాల పైనుంచి అట్టుడికిస్తూనే ఉంది. జనం వర్షాల కోసం తపిస్తున్న తరుణంలో నిప్పుల వాన కురుస్తోంది. తాజాగా శుక్రవారం మరింత తీవ్రరూపం దాల్చింది. ఫ్రైడే ×ఫ్రైకీ డేగా మారింది. అనకాపల్లి పట్టణంలో మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారిగా 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) పేర్కొంది. ఇటీవల కాలంలో ఇంతటి గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు కాకపోవడం గమనార్హం. జిల్లాలో పలుచోట్ల ఉష్ణోగ్రత 44 డిగ్రీలు దాటింది. ఉదయం నుంచే సూర్యతాపం ప్రతాపం చూపడం మొదలైంది. మధ్యాహ్నానికి మరింత తీవ్రరూపం దాల్చడంతో వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీచాయి. రాత్రి ఏడు గంటలు దాటినా వాతావరణం చల్లబడకుండా వేడి గాలులు కొనసాగుతూనే ఉన్నాయి.

జిల్లావాసులు విలవిల

వారం రోజులుగా భానుడి భగభగలకు జిల్లావాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శుక్రవారం ఈ వేసవిలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. అనకాపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. అయితే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వారి లెక్కల ప్రకారం అనకాపల్లిలో 46.10 డిగ్రీల ఎండ కాసింది. మొత్తానికి జనం మాత్రం వేడిమిని తాళలేక అట్టుడికిపోయారు. ఉదయం 10 గంటల నుంచి వడగాడ్పులు వీచడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రహదారులు బోసిపోయాయి. అనకాపల్లిలోని ప్రధాన రహదారి నెహ్రూచౌక్ కూడలి నిర్మానుష్యంగా మారింది. సాయంత్రం 5 గంటలైనా వాతావరణం చల్లబడకపోవడంతో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు వెలవెలబోయాయి.

నేడు మరింత తీవ్రం..

మరోవైపు శనివారం ఉష్ణోగ్రతలు మరింత ఉగ్రరూపం దాల్చనున్నాయి. ఫలితంగా పలుచోట్ల వడగాడ్పులు, కొన్ని చోట్ల తీవ్ర వడగాడ్పులు, అక్కడక్కడ అత్యంత తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. అందువల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, నీరు, ద్రవ పదార్థాలు ఎక్కువగా సేవించాలని సూచించింది. ఉమ్మడి విశాఖలో మరో మూడు రోజులు వడగాడ్పుల ప్రభావం ఉంటుందని తెలిపింది.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వారి లెక్కల ప్రకారం శుక్రవారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా.. (డిగ్రీలలో)

ప్రాంతం	ఉష్ణోగ్రత
అనకాపల్లి	46.10
పాయకరావుపేట	44.50
దేవరాపల్లి	44.40
నక్కపల్లి	44.40
ఎస్.రాయవరం	44.33
రోలుగుంట	44.32
రావికమతం	44.00
మాడుగుల	44.00
చోడవరం	43.72

ఆర్ఏఆర్ఎస్ గణాంకాల ప్రకారం అనకాపల్లిలో గత పదేళ్లలో నమోదైన అధిక ఉష్ణోగ్రతలు ఇలా...

తేదీ	ఉష్ణోగ్రత
26-05-2013	46.5
14-06-2014	42.8
26-05-2015	45.7
24-05-2016	42.4
16-05-2017	41.7
19-06-2018	40.9
16-06-2019	44.6
22-05-2020	38.3
28-05-2021	41.1
25-05-2022	40.5
16-06-2023	44.5

జిల్లాలో 1.50 లక్షల మందికి ఉపాధి

- డ్వామా పీడీ సందీప్



మాడుగుల రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 1.50 లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పించినట్టు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు ఇ. సందీప్ తెలిపారు. మండలంలోని జి. అగ్రహారంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండు వేసవి దృష్ట్యా ఉపాధి పనులు రోజూ ఉదయం 5 నుంచి 9 గంటల వరకు చేస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా కూలీలకు 67 లక్షల పని దినాలు కల్పించామని, తద్వారా రూ.176 కోట్లు వారి వ్యక్తిగత ఖాతాలకు జమా చేశామన్నారు. పనిచేసిన ప్రతి వేతనదారుకు సరాసరి రూ.267 అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం చెరువులు, సాగునీటి కాలువల పూడికతీత పనులు చేపట్టామన్నారు. చెరువు గట్లు మీద కొబ్బరి, జీడి, మామిడి మొక్కలు పెంపకం చేపడుతున్నామన్నారు. చిన్న, సన్నకారు రైతులను ఉద్యానవన పంటల పెంపకానికి ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. వీరికి 600 ఎకరాల్లో మామిడి, జీడి, కొబ్బరి మొక్కలు అందజేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా రిజర్వు ఫారెస్టు పథకంలో 3,700 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసి, ప్రతి ఒక్కరికీ పనిదినాలు కల్పిస్తామన్నారు. చెరువుల గట్టు పటిష్టతకు మొక్కలు వెయ్యడం శ్రేయస్కరమన్నారు. ఖాళీ టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులు భర్తీ చేస్తామన్నారు. సామాజిక తనిఖీ బృందాలు పరవాడ మండలంలో తనిఖీ ప్రారంభించారని, ప్రస్తుతం పాయకరావుపేట మండలంలో చేస్తున్నారన్నారు. సమావేశంలో ఏపీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధుడు మృతి


తాతబ్బాయి

నక్కపల్లి: మండలంలోని దేవవరం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఇసంపల్లి తాతబ్బాయి(105) శుక్రవారం మృతి చెందారు. తాతబ్బాయి దేవవరం రేషన్ డీలర్‌గా దాదాపు ఏడు దశాబ్దాలు పనిచేశారు.అనారోగ్యం కారణంగా దాదాపు రెండేళ్లనుంచి ఇంటికే పరిమితమయ్యారు. తీవ్ర అనారోగ్యం కారణంగా ఇటీవల విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. తాతబ్బాయికి నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. తాతబ్బాయి మృతి పట్ల ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ గొర్ల నర్సింహమూర్తి,మాజీ ఎంపీటీసీ దండు బలరామరాజు, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి,వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, స్థానిక నాయకులు అంగరాజు పెదరాము, నూకన్న నాయుడు సఖిరెడ్డి రమణ, కోనసర్సింహమూర్తి, చిట్టబ్బాయి, పాపారావు , జిసూరి బాబు డీలర్ల సంఘం నాయకులు ఈశ్వరరావు, హరి, రామకృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆటోమొబైల్ షాపులో చోరీ

ఎస్.రాయవరం: అడ్డురోడ్డులోని ఓ ఆటోమొబైల్ షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గెడ్డపాలెం గ్రామానికి చెందిన దేవ రవికి అడ్డురోడ్డులో ఆటోమొబైల్ షాపు ఉంది. గురువారం రాత్రి యథావిధిగా షాపు మూసి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో షాపులోకి దొంగలు చొరబడి రూ.1.20 లక్ష నగదు, ల్యాప్‌టాప్, నాలుగు ఫోన్లు చోరీ చేశారు. శుక్రవారం ఉదయం షాపునకు వచ్చిన రవి చోరీ జరిగినట్టు గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పేద విద్యార్థులకు ఉత్తమ విద్య

- జగనన్న ఆణిముత్యాల పథకంలో విద్యార్థులను సత్కరించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


ప్రతిభ చూపిన విద్యార్థిని సత్కరించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రభుత్వ విద్యా వ్యవస్థలో అత్యుత్తమైన మార్పులు తెచ్చిన పేద విద్యార్థులకు ఉత్తమైన విద్యను అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో «జగనన్న ఆణిముత్యాలు» కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులను ఘనంగా సత్కరించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు ఇలా ఉత్తమ విద్యార్థులను సత్కరించిన సంఘటనలు లేవన్నారు. ప్రతి విజయంలోనూ విజేతలను ప్రోత్సహిస్తూ.. అన్ని రంగాల్లోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అండగా నిలుస్తున్నారన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రభుత్వ పాఠశాలంటే చులకనగా చూసే రోజుల నుంచి అందరం చదువుకోవాలనే ఉన్నత స్థాయికి సర్కారు బడులను తీర్చిదిద్దారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నాడు-నేడు పథకంలో అన్ని ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేయడంతోపాటు అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యా కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి సౌకర్యం, విదేశీ విద్య వంటి పథకాలతో విద్యార్థులకు సీఎం ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. పేద విద్యార్థులు సైతం ఉన్నత విద్య చదువుకోవడం ద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని ధర్మశ్రీ చెప్పారు. ఎంపీపీ గాడి కాసు, జెడ్పీటీసీలు దొండా రాంబాబు, పోతల లక్ష్మీశ్రీనివాస్, హెచ్ఎం. ఐ.వి. రామిరెడ్డి, ఎంఈవో శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ దేవరపల్లి కుమారి పాల్గొన్నారు.

చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం


ఇ-ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, దీనిలో భాగంగా చెత్త రహిత మున్సిపాలిటీగా నర్సీపట్నం తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. చెత్త తరలింపునకు ప్రభుత్వం పది ఇ-ఆటోలను మున్సిపాలిటీకి కేటాయించింది. తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఇ- వాహనాలను మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మితో ఆయన కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనుల నిమిత్తం క్లాప్ క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 41 లక్షల విలువ గల 10 ఇ-ఆటోలను ప్రభుత్వం మున్సిపాలిటీకి కేటాయించిందన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు ఇ-ఆటోల ద్వారా ప్రతి ఇంటి దగ్గర తడి, పొడి చెత్త, ప్రమాదకరమైన వ్యర్థాలను విడివిడిగా సేకరించడం జరుగుతుందన్నారు. సేకరించిన చెత్తను సాలిడ్వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు తరలించి తడిచెత్తను ఎరువుగాను, పొడిచెత్తను రీసైక్లింగ్‌కు వినియోగించడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్ది ప్రజారోగ్యాన్ని కాపాడటంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, బయపురెడ్డి చినబాబు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, కర్రి శ్రీనివాసరావు, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో మౌలిక వసతులకు కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి


మౌలిక వసతులపై వైద్యులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

యలమంచిలి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వసతుల సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక సీహెచ్‌సీని సందర్శించారు. ఇక్కడ అందుతున్న సేవలపై రోగులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో మౌలిక వసతులపై వైద్య బృందాన్ని ఆరా తీశారు. సీహెచ్‌సీలో కొన్ని మైనర్ మరమ్మతులు, మౌలిక వసతులపై వివరించారు. త్వరలోనే నూతనంగా ప్రారంభమవుతున్న ఆస్పత్రికి స్వర్గీయ ఆడారి తులసీరావు జ్ఞాపకార్థంగా అందజేయనున్న పరికరాల గురించి వైద్యులతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యలమంచిలి పట్టణంలో పెరుగుతున్న జనాభా ఆరోగ్యం దృష్ట్యా స్థానిక తులసీనగర్‌లో నూతనంగా ఆధునిక వసతులతో కూడిన ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే ఇది అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలందనున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు యలమంచిలి పట్టణంలో చేస్తామన్నారు. అర్బన్ క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఆస్పత్రిలో వైద్యపరమైన సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ తగాదాలతోనే రమణ హత్య

- సీఐ నారాయణ రావు వెల్లడి
- నిందితుడు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నారాయణరావు

నక్కపల్లి: భూ తగాదాల కారణంగానే పెద తీనార్లలో కారే రమణ అనే వ్యక్తిని మైలపల్లి లోవరాజు హత్య చేసినట్టు నక్కపల్లి సీఐ నారాయణరావు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు హత్యకేసు నమోదుచేసి, లోవరాజును శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. రెండు రోజుల క్రితం పెదతీనార్లలో రమణ అనే వ్యక్తి హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆ కేసు వివరాలను శుక్రవారం సీఐ తెలియజేశారు.

రమణకు చెందిన భూమి లోవరాజు ఆధీనంలో ఉందని, అక్రమంగా తమ భూమిని కాజేశాడంటూ రమణ తరచూ లోవరాజుతో గొడవపడేవాడని సీఐ చెప్పారు. బుధవారం కూడా ఈ విషయమై లోవరాజును రమణ నిలదీశాడు. తమ భూమిని కాపాడుకునేందుకు కోర్టుకు వెళ్తానని చెప్పడంతో ఎప్పటికైనా కోర్టుకు వెళ్తాడన్న అక్కసుతో లోవరాజు క్రికెట్ బ్యాట్‌తో రమణ తలపై బలంగా కొట్టాడు. వెంటనే రక్త స్రావమై స్పృహతప్పి పడిపోయిన రమణను కుటుంబ సభ్యులు విశాఖలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మరణించాడని సీఐ చెప్పారు.ఈ సమావేశంలో ఎస్ఐ శిరీష పాల్గొన్నారు.

టెంటు దహనం చేశారంటూ ఫిర్యాదు

మాకవరపాలెం: క్వారీ అనుమతులు రద్దు చేయాలంటూ నిరసన చేస్తున్న ప్రాంతంలో టెంటును దహనం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశామని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు శుక్రవారం తెలిపారు. మండలంలోని జి.కోడూరు రెవెన్యూలోని సర్వే నంబర్ 332లో క్వారీ నిర్వహణకు అనుమతులు రద్దు చేయాలని సమీప దళిత రైతులు నిరసన చేపట్టారు. ఈ నేపథ్యంలో నిరసనకారులు నీడగా వేసుకున్న టెంటును గురువారం రాత్రి దహనం చేశారని ఫిర్యాదులో తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

రహదారులు & భవనముల శాఖ : పాడేరు డివిజన్

బహిరంగ ప్రకటన, తేది 15.06.2023

(పూర్వపు విశాఖపట్నం జిల్లా) ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో గొలుగొండ మండలంలో చీడిగుమ్మల యర్రవరం గ్రామ శివారు రాజులబాబు గుడి నుండి పప్పుశెట్టిపాలెం గ్రామం మధ్యలో నర్సీపట్నం - కెడిపేట - దేవీపట్నం రోడ్డులో అరిలోవ రిజర్వు ఫారెస్టులో ఉన్న (R&B) శాఖ వారి 3.4 K.M. పొడవు రోడ్డును సింగిల్ లేను నుండి డబుల్ లేన్‌గా వెడల్పు చేయుటకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము అటవీశాఖ మరియు భారత ప్రభుత్వము పర్యావరణము అడవుల మంత్రిత్వశాఖ వారు అటవీశాఖకు చెందిన 2.10 హెక్టార్లు (5 ఎకరాల 20 సెంట్లు) భూమిని రహదారులు & భవనముల శాఖకు చెందిన రోడ్డును వెడల్పు చేయుటకు ఈ క్రింది ఉత్తర్వు మరియు నిబంధనల మేరకు కేటాయించినారని ఈ బహిరంగ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేసుకొనుచున్నాము.

పైన తెలిపిన ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వ లేఖ నం.లు 967/Section IV 2022 (1430031) తేది: 25-03-2022 మరియు అటవీ (సంరక్షణ) చట్టం, 1980లో సెక్షన్ 2కి అనుగుణంగా అటవీ భూమి మళ్ళింపు కోసం కేంద్ర ప్రభుత్వ ముందస్తు ఆమోదం కోరుతూ 29-03-2022న అందిన ఆన్‌లైన్ ప్రతిపాదన నం.FP/AP/ROAD/44481/2020 లను రిఫర్ చేయండి.

రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ప్రతిపాదనను శ్రద్ధగా పరిశీలించిన తర్వాత దిగువ తెలిపిన నిబంధనలకు లోబడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, R&B డివిజన్, పాడేరు పేరున కి.మీ. 7/4 నుండి 12/0, 16/0 నుండి 17/0, 21/0 నుండి 25/0 నుండి 29/500 నుండి 30/0 వరకు నర్సీపట్నం - దేవీపట్నం రోడ్ వెడల్పు చేయుట మరియు పటిష్ఠపరచుట కోసం అరిలోవ RF, నర్సీపట్నం డివిజన్‌లోని కంపార్ట్‌మెంట్ నం. 1205, 1206, 1207 & 1208లోని 2.10 హెక్టార్ల అటవీ భూమి మళ్ళింపు కోసం అటవీ (సంరక్షణ) చట్టం, 1980లోని సెక్షన్ 2 క్రింద నేను సూత్రప్రాయ ఆమోదాన్ని (స్టేజ్ -I) కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయవలసి ఉంది.

(i) మళ్ళించిన అటవీ భూమి న్యాయ స్థితి యథాతథంగా ఉంది.

(ii) ప్రతిపాదిత అటవీ భూమి ఏరియా డీమార్కేషన్‌ను 4 అడుగుల ఎత్తు గల సిమెంట్ కాంక్రీట్ పిల్లర్లను 20 మీటర్లకు ఒకటి చొప్పున యూజర్ ఏజెన్సీ వ్యయంతో చేపట్టబడింది.

(iii) యూజర్ ఏజెన్సీ వ్యయంతో **పాకలపాడు గ్రామం, గొలుగొండ మండలం, విశాఖపట్నం జిల్లాలో సర్వే నం. 203లో 2.10 హెక్టార్ల విస్తీర్ణానికిపైగా** గుర్తించిన అటవీయేతర భూమిలో నష్టపరిహార అడవుల పెంపకాన్ని రాష్ట్ర అటవీ శాఖ వారు చేపట్టాలి.

(iv) **పాకలపాడు గ్రామం, గొలుగొండ మండలం, విశాఖపట్నం జిల్లాలోని సర్వే నం. 203లోని 2.10 హెక్టార్ల విస్తీర్ణానికిపైగా** నష్టపరిహార అడవుల పెంపకం కోసం గుర్తించిన పూర్తి అటవీయేతర భూమిని రాష్ట్ర అటవీ శాఖ పేరున బదిలీచేయాలి మరియు మ్యూటేట్ చేయాలి మరియు దానిని భారత అటవీ చట్టం, 1927 లేదా రాష్ట్ర ప్రభుత్వ చట్టంలోని సంబంధిత సెక్షన్(లు) క్రింద సెక్షన్-4 క్రింద రిజర్వ్ ఫారెస్ట్‌గా లేదా సెక్షన్ 29 క్రింది రక్షిత అడవిగా ప్రకటించాలి. అట్టి ఒరిజినల్ నోటిఫికేషన్ యొక్క కాపీని **సమాచారం మరియు రికార్డ్ కోసం స్టేజ్ II** అనుమతికి ముందుగా ఈ కార్యాలయానికి దాఖలు చేయాలి.

(v) CA ఉపయోగం మరియు CA స్కీమ్ కోసం గుర్తించిన అటవీయేతర భూమిని కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతి లేకుండా మార్చరాదు.

(vi) రిట్ పిటిషన్ (సివిల్) నం. 202/1995లోని సంబంధిత IAలతో IA No.S 826 ఇన్ 566లో గౌరవనీయ సుప్రీమ్‌కోర్ట్ తేది: 28-03-2008 మరియు 09-05-2008 ఉత్తర్వుల ప్రకారం మరియు మంత్రిత్వ శాఖ గైడ్‌లైన్ నం. **5-3/2011-FC (Vol-I) తేది: 06-01-2022 ప్రకారం సవరించిన NPV ప్రకారం మరియు 19-01-2022 తేది గల లేఖ ప్రకారం** జారీచేసిన స్పష్టీకరణ ప్రకారం యూజర్ ఏజెన్సీకి **2.10 హెక్టార్ల** విస్తీర్ణం గల మళ్ళించిన అటవీ భూమిలో నికర ప్రస్తుత విలువను రాష్ట్ర ప్రభుత్వం విధించాలి.

(vii) భవిష్యత్‌లో భారత సర్వోన్నత న్యాయస్థానం వారిచే దానిని పరిశీలించిన తర్వాత బకాయిగా మారిన మళ్ళించిన అటవీ భూమి నికర ప్రస్తుత విలువ (NPV)లో ఏదైనా అదనపు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం యూజర్ ఏజెన్సీకి విధించాలి. యూజర్ ఏజెన్సీ దీనిని అమలు చేసేందుకు ఒక అండర్ టేకింగ్ దాఖలు చేయాలి.

(viii) ప్రాజెక్ట్ క్రింద యూజర్ ఏజెన్సీ నుండి అందిన అన్ని నిధులు ఇ-పోర్టల్ (https://parivesh.nic.in/) ద్వారా మాత్రమే CAMPA ఫండ్‌కు బదిలీ చేయాలి/ డిపాజిట్ చేయాలి.

(ix) యూజర్ ఏజెన్సీ ప్రాజెక్ట్ వ్యయంలో సంబంధిత DFOను సంప్రదించి అవసరమైనచోట రిటెయినింగ్ వాల్స్ మరియు చెక్ వాల్స్‌ను నిర్మించాలి.

(x) **యూజర్ ఏజెన్సీ మళ్ళింపు కోసం ప్రతిపాదించిన 2.10 హెక్టార్లకు బదులుగా 1.05 హెక్టార్ల కోసం మాత్రమే Kml ఫైల్ దాఖలు చేసింది. కావున మొత్తం విస్తీర్ణం అనగా 2.10 హెక్టార్ల కోసం Kml ఫైల్‌ను ఆన్‌లైన్ దరఖాస్తులో దాఖలు చేయవలెను. రాష్ట్ర ప్రభుత్వంవారు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపే ముందు సరైన Kml ఫైల్ అప్‌లోడింగ్‌ను పరిశీలించాలి.**

(xi) **ప్రస్తుతం 3.66 మీటర్ల BT రోడ్డు ఉందని మరియు అదనంగా 5.84 మీటర్ల వెడల్పు (రోడ్డుకు ఇరువైపులా ప్రతిచోట 1.25 మీటర్ల వెడల్పుతో గల షోల్డర్స్‌తో సహా) ప్రతిపాదించబడినదని DFO పేర్కొన్నారు. ప్రస్తుతం గల BT రోడ్డు పోర్షన్ ప్రతిపాదనలో చేర్చబడని కారణంగా RoW పేర్కొంటూ అధికారిక RF నోటిఫికేషన్ దాఖలుచేయవచ్చును.**

(xii) సహజమైన వాగులు/ నదులు/ కాలువలపైన కల్వర్టులు/ బ్రిడ్జిలు ఏవైనా నిర్మించదలిస్తే నీటి నిల్వ పెరగకుండా సహజంగా నీటిపారుదల ఉండేలా మరియు వన్యప్రాణుల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా ఉండేలా ఉండాలి.

(xiii) ఇంజనీరింగ్ సపోర్ట్‌కు అవసరమైన రోడ్‌సైడ్ కటింగ్స్ మరియు ఫిల్లింగ్స్‌ను మట్టిని స్థిరంగా ఉంచే విధంగా సంబంధిత DFO సూచనల ప్రకారం సమకూర్చాలి.

(xiv) త్రవ్విన మెటీరియల్ ఓవర్ బర్డన్‌ను అటవీప్రాంతం వెలుపల కుప్పగాపోయాలి. అటవీప్రాంతంలో ఎటువంటి మెటీరియల్‌ను నిల్వ ఉంచరాదు.

(xv) సంబంధిత DFO యొక్క ఖచ్చితమైన పర్యవేక్షణ క్రింద చెట్లను పడగొట్టవలెను. మరియు సాధ్యమైన చోట చెట్ల ట్రాన్స్‌లోకేషన్ యూజర్ ఏజెన్సీ ఖర్చుపైన నిర్వహించవలెను.

(xvi) ప్రతిపాదన యొక్క లేఅవుట్ ప్లాన్ కేంద్ర ప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం లేకుండా మార్పుచేయరాదు.

(xvii) చెట్లు పడగొట్టడం/ నష్టం నివారించేందుకు సైట్ వద్ద పనిచేస్తున్న కార్మికులకు ప్రత్యామ్నాయ ఇంధనం ప్రధానంగా వంట చెరుకును యూజర్ ఏజెన్సీ ఏర్పాటు చేయాలి మరియు అటవీ ప్రాంతం లోపల ఎటువంటి లేబర్ క్యాంప్ ఏర్పాటు చేయరాదు.

(xviii) సాధ్యమైనంత వరకూ అటవీప్రాంతం వెలుపల లేబర్ క్యాంపులు ఏర్పాటుచేయడం ద్వారా సిబ్బందిని సాధ్యమైనంతవరకు తగ్గించాలి మరియు సమీపంలోని అటవీ వృక్ష జంతు జాలాలకు నష్టం కలిగించకుండా పని నిర్వహణలో నియమించబడిన కార్మికులు మరియు సిబ్బంది జాగ్రత్త వహించేలా చూసేందుకు యూజర్ ఏజెన్సీ బాధ్యత వహించాలి.

(xix) ప్రాజెక్ట్ కోసం ఉపయోగించబడే మొత్తం అటవీ ప్రాంతం **2.10 ha** కు మించరాదు మరియు మళ్ళించిన అటవీ ప్రాంతం మళ్ళింపు ప్రతిపాదనలో చూపించిన అవసరానికి కాకుండా వేరే ఏ ఇతర అవసరానికి దీనిని ఉపయోగించరాదు. యూజర్ ఏజెన్సీ దీనికి సంబంధించి అండర్‌టేకింగ్ సమర్పించవలసి ఉంటుంది.

(xx) మళ్ళింపు కోసం ప్రతిపాదించిన అటవీ భూమి ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం తీసుకోకుండా ఏ ఇతర ఏజెన్సీకి, డిపార్ట్‌మెంట్‌కి లేదా వ్యక్తికి బదిలీ లేదా సబ్‌లెట్ చేయరాదు.

(xxi) యూజర్ ఏజెన్సీ మరియు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్‌కు వర్తించే విధంగా అమలులో ఉన్న అన్ని చట్టాలు, రూల్స్, రెగ్యులేషన్స్ మరియు మార్గదర్శకాలలోని నిబంధనలు పాటించేలా హామీనివ్వవలెను.

(xxii) ప్రాంతంలోని వృక్ష జంతు జాలాల సంరక్షణ మరియు నిర్వహణ, అటవీకరణ ప్రయోజనాలకై కాలానుగతంగా విధించే విధంగా కేంద్ర ప్రభుత్వం లేదా రీజనల్ ఆఫీసర్ (సెంట్రల్) ఆఫ్ ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్, విజయవాడ వారి యొక్క ఏవైనా ఇతర నిబంధనలను యూజర్ ఏజెన్సీ పాటించాలి.

(xxiii) పైన తెలిపిన నిబంధనలు వేటినైనా పాటించడంలో విఫలమైతే, FAC 1980 క్రింద జారీచేసిన రూల్స్/ మార్గదర్శక సూత్రాల ప్రకారం అపరాధ చర్యకు యూజర్ ఏజెన్సీ బాధ్యత వహించవలసి ఉంటుంది.

(xxiv) పైన తెలిపిన నిబంధనలపైన రాష్ట్ర ప్రభుత్వం కాంప్లియెన్స్ రిపోర్ట్‌ను ఆన్‌లైన్ (https://parivesh.nic.in/) ద్వారా ప్రాసెస్ చేసి, దాఖలు చేస్తుంది.

పైన పేర్కొన్న నిబంధనలపైన కాంప్లియెన్స్ రిపోర్ట్ అందిన తరువాత సదరు ప్రతిపాదన తుది ఆమోదం కోసం పరిశీలించబడుతుంది. ఈ సూత్రప్రాయ ఆమోదం ఈలేఖ జారీచేసిన తేదీ నుండి 5 సంవత్సరాల కాల వ్యవధి కోసం చెల్లుబాటులో ఉంటుంది. పైన తెలిపిన నిబంధనలు పాటించకపోతే, 5 సంవత్సరాల తరువాత ఈ సూత్రప్రాయ ఆమోదం ఆటోమేటిక్‌గా ఉపసంహరించబడుతుంది.

కార్యనిర్వాహక ఇంజనీరు,
రహదారులు & భవనముల శాఖ, పాడేరు

ఖరీఫ్‌లో సాగు పెంపునకు కృషి


జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామారావు, జేసీ జాహ్నవి

- అర్హులైన ప్రతి కౌలు రైతుకు సచివాలయం ద్వారా కౌలు హక్కు పత్రాల జారీ
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆదేశం

సాక్షి, అనకాపల్లి: గత ఏడాది కన్నా ఈసారి ఖరీఫ్ సాగు పెంపునకు అధికారులంతా కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు చెప్పారు. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా నిల్వ ఉంచాలని.. ముందుగానే ఆర్డర్లు పెట్టుకుని ఉండాలని అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో అర్హులైన కౌలు రైతులందరికీ సచివాలయాల ద్వారా కౌలు హక్కు పత్రాలు జారీ చేయాలని, ఇందుకు జిల్లాలో 2,875 రైతులను అర్హులుగా ఎంపిక చేశామని చెప్పారు. రైతుకు పంట రుణాలపై ఉన్న 10 శాతం వడ్డీని 5 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సీహెచ్‌సీ యాప్‌లో రైతుల నమోదు ప్రక్రియ, «రైతు భరోసా-పీఎం కిసాన్» పెట్టుబడి ఆర్థిక సహాయం చెల్లింపుల్లో రిజెక్ట్ అయిన 4115 మంది రైతులకు అందేలా చేయాలని ఆదేశించారు. ఈకేవైసీ చేయించుకోకపోవడంతో 28,020 మంది రైతులు లబ్ధి పొందలేదని.. త్వరితగతిన స్థానిక ఆర్‌బీకేలో అగ్రి అసిస్టెంట్, వలంటీర్ సహాయంతో ఈకేవైసీ నమోదును త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంలో 10,017మంది రైతులను 97,856 ఎకరాల సాగుకు సన్నద్ధం చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. జీడి మామిడికి వాతావరణ ఆధారిత భీమా పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు ఉద్యానవన జేడీ ప్రభాకర్‌రావు తెలిపారు. జిల్లా మత్స్యకార శాఖ జేడీ లక్ష్మణరావు మాట్లాడుతూ.. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం, ఫిష్ కియోస్కులు, మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్‌లు, ఇతర పథకాల ప్రగతి తెలియజేశారు. జేసీ జాహ్నవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు, పశుసంవర్ధక శాఖ అధికారి ప్రసాద్‌రావు, ప్రకృతి వ్యవసాయ అధికారి లచ్చన్న, డ్రిప్ ఇరిగేషన్ అధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన జీడిమామిడి తోట


కాలిపోతున్న జీడిమామిడి చెట్లు

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లి సర్వే నంబర్ 138, 139లో జీడిమామిడి తోట అగ్నికి ఆహుతైంది. సంబంధిత భూములను ఏపీఐఐసీకి ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. అయితే శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా చెట్లకు మంటలంటుకున్నాయి. ఈ విషయం తెలియడంతో స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. వెంటనే అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. విషయాన్ని తహసీల్దార్ పి.ప్రకాషరావు దృష్టికి వెంకటాపురం మాజీ ఉప సర్పంచ్ గనిశెట్టి సత్యనారాయణ తీసుకువెళ్లారు. 30 నుంచి 32 ఎకరాల వరకు జీడి చెట్లు కాలిపోయినట్లు సమాచారం ఎంత నష్టం వాటిల్లిందనే వివరాలు ఇంకా అధికారుల పరిశీలనలో తేలాల్సి ఉంది.

మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి పరిహారం


అభిజిత్ కంపెనీ గేటు ముందు ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అస్వస్థతకు గురై మృతిచెందిన అచ్యుతాపురం మండలం తాళ్లదిబ్బకు చెందిన కార్మికుడు రెడ్డి అప్పలరాజు(30)కుటుంబానికి రూ.7.50 లక్షల పరిహారం చెల్లించేందుకు అభిజిత్ పరిశ్రమ యాజమాన్యం అంగీకరించింది. వివరాలు ఇలా ఉన్నాయి. అభిజిత్ పరిశ్రమలో పనిచేస్తున్న అప్పలరాజు రెండు రోజుల క్రితం విధులకు హాజరై అనారోగ్యానికి గురయ్యాడు. ఆయనను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అప్పలరాజు కుటుంబ సభ్యులు శుక్రవారం అభిజిత్ గేటు ముందు ఆందోళన చేశారు. దీంతో రూ.7.50 లక్షలు చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది.ఈ ఆందోళనలో వివిధ పార్టీల నాయకులు ఆర్.రాము, ప్రగడ నాగేశ్వరరావు,చిప్పాడ సర్పంచ్ రాజాన నాయుడుబాబు,రాజాన రామునాయుడు, యాంద్ర అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుంకరమెట్ట రహదారికి మోక్షం

- రహదారి పూర్తికి హైవే అథారిటీ చొరవ
- రెండు రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి

వాహన చోదకుల ఇక్కట్లు తీరనున్నాయి. దాదాపు దశాబ్దంగా పునరుద్ధరణకు నోచుకోని సుంకరమెట్ట రహదారికి మోక్షం కలిగింది. రూ.20 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసుకుని, వాహనదారులకు అందుబాటులోకి రానుంది.



సుంకరమెట్ట కూడలిలో భారీ యంత్రాలతో రహదారి పనులు చేపడుతున్న దృశ్యం



జలగల మదుం వద్ద నిర్మిస్తున్న రహదారి

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి నిర్మాణంలో సుంకరమెట్ట రోడ్డుకు మోక్షం కలిగింది. శిథిలావస్థకు చేరుకున్న సుంకరమెట్ట జంక్షన్ నుంచి శంకరం పంచాయతీ బొజ్జన్నకొండ వరకు ఉన్న రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వాల్లో ప్యాచ్ వర్క్‌లకే పరిమితమైన రోడ్డు, ప్రస్తుతం పూర్తిస్థాయిలో పునరుద్ధరణకు నోచుకుంది.

ఆర్అండ్‌బీ–ఎన్‌హెచ్ఏఐ సమన్వయంతో..

జాతీయ రహదారి విస్తరణ సమయంలో చాలా వాహనాలు ఇదే రోడ్డులో ప్రయాణించేవి. దీంతో రోడ్డు దారుణంగా మారింది. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురయ్యేవారు. దీంతో ఈ రహదారి మరమ్మతులకు భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ)కు రోడ్లు, భవనాల శాఖ(ఆర్అండ్‌బీ)కి మధ్య ఒప్పందం కుదిరింది. జాతీయ రహదారి పనులు పూర్తి కావడంతో హైవేను ఆనుకుని ఉన్న లింకురోడ్లన్నింటినీ సుమారు రూ.20 కోట్లతో పునరుద్ధరించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. దీంతో అనకాపల్లికి ఆనుకుని సుంకరమెట్ట జాతీయ రహదారి నుంచి జలగల మదుం వరకు, అక్కడి నుంచి శంకరం రోడ్డుకు సుమారు 5 కిలోమీటర్ల మేర రహదారి పనులు చేపట్టారు.

చురుగ్గా నిర్మాణ పనులు

కోల్‌కతా నుంచి చెన్నైకు వెళ్లే భారీ వాహనాలు శంకరం నుంచి సుంకరమెట్ట జలగలమదుం మీదుగా రాకపోకలు సాగించేవి. ఆరులైన్ల రహదారి విస్తరణలో జలగలమదుం జంక్షన్ నుంచి ఆవఖండం మీదుగా ఫ్లైఓవర్ నిర్మించి రహదారికి అనుసంధానం చేశారు. దీంతో పట్టణం మీదుగా ప్రయాణించే భారీ వాహనాల సంఖ్య తగ్గింది. అనకాపల్లి పట్టణం నుంచి విశాఖ, విజయనగరానికి వెళ్లే వాహనాలు మాత్రమే ఈ రహదారి రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో శిథిల రోడ్డు పునరుద్ధరణ పనుల్ని రెండు రోజుల క్రితం ప్రారంభించారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో రెండు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తయి, పూర్తిస్థాయిలో వాహనదారులకు అందుబాటులోకి రానున్నట్టు అధికారులు చెప్తున్నారు.

పదేళ్ల తర్వాత విముక్తి



రహదారి గోతులమయంగా మారడంతో గత పదేళ్ల నుంచి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డాం. హైవే అథారిటీ అధికారుల చొరవతో నూతనంగా రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. రహదారికిరువైపులా డ్రైనేజీలు నిర్మిస్తే రహదారిపై మురుగు నీటి ప్రవాహ సమస్య తీరి, రోడ్డు పదికాలాలు మన్నిక వస్తుంది.

– కల్యాణ్‌చక్రవర్తి, వాహనదారుడు, తుమ్మపాల

రెండురోజుల్లో అందుబాటులోకి



రెండు రోజుల్లో నిర్మాణ పనులు పూర్తయి, పూర్తిస్థాయిలో రహదారి అందుబాటులోకి వస్తుంది. ఇక మీదట వాహనచోదకులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఈ రహదారి ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్నప్పటికీ, కొన్ని కారణాలతో హైవే అథారిటీ అధికారులు రహదారి నిర్మాణానికి చొరవ చూపారు.

– ఎస్.వెంకటరమణ, జోనల్ కమిషనర్, అనకాపల్లి

జగనన్న మేలు మరువకండి.. మళ్లీ గెలిపించండి

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



కోట్నివీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

తుమ్మపాల : అణగారిన వర్గాలను, పేదలను ఆదుకున్నది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని, ఆయన చేసిన మేలు మర్చిపోకుండా, రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. పట్టణంలోని కోట్ని వీధిలో కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం కృషి చేసిందన్నారు. సంక్షేమ పథకాల పేరుతో డబ్బులు వృధా చేస్తున్నారన్న చంద్రబాబు అధికారంలోకి వస్తే ఈ పథకాలను తొలగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో పేదవారు బాగుపడింది లేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పైసా అవినీతికి ఆస్కారం లేకుండా పథకాలన్నీ నేరుగా ప్రజలకే అందిస్తున్నామని, అందుకే తాము ధైర్యంగా ప్రజల్లో తిరగగలుగుతున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన జగన్‌తో, బూటకపు హామీల పేరిట మోసం చేసే చంద్రబాబును ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గంలో సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి నేరుగా తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి కోరుకొండ రాఘవ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రైడేతో దోమల నియంత్రణ



ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీ, కార్పొరేటర్

తుమ్మపాల : జీవీఎంసీ ఆధ్వర్యంలో శుక్రవారం 81వ వార్డులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. రోజుల తరబడి నిల్వ ఉన్న నీటిలో డెంగ్యూ, మలేరియా కారక దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వాటి నివారణకు పరిసరాలు, ఇళ్లల్లో నీటి నిల్వలను పూర్తిగా తొలగించాలని సూచించారు. కార్పొరేట్ పీలా లక్ష్మీసౌజన్య మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ నివారణకు జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది సూచనల్ని తప్పక అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పీలా రాంబాబు, శానిటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



ఆర్డీవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న తహసీల్దార్

కశింకోట : మండల తహసీల్దార్‌గా జి.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ బి.సుధాకర్‌ను మండలంలో భూముల రీ సర్వే సవ్యంగా సాగలేదని, బాధ్యతా రహితంగా వ్యవహరించారనే అభియోగంపై ఫిబ్రవరిలో సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఉప తహసీల్దార్ సురేష్‌నాయుడు ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా ఇప్పటి వరకు వ్యవహరించారు. ఈ నేపథ్యంలో విశాఖ ఆర్డీవో కార్యాలయంలో డీటీగా పని చేస్తున్న సత్యనారాయణ పదోన్నతిపై తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిటీ సురేష్‌కుమార్, సర్వేయర్ ధనుంజయ్, అధికారులు, సిబ్బంది ఆయనను అభినందించారు. అనంతరం ఆయన అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు సేవలందించాలని ఆర్డీవో సూచించారు.

జీవీఎంసీ జోన్ ఏసీపీగా మహాపాత్రో

అనకాపల్లిటౌన్ : జీవీఎంసీ జోన్ అసిస్టెంట్ సిటీప్లానర్(ఏసీపీ)గా మహాపాత్రో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి సాధారణ బదిలీల్లో అనకాపల్లి జోన్‌కు వచ్చారు. ఏడాదిగా ఖాళీగా ఉన్న ఈ పోస్టు పాత్రో రాకతో భర్తీ అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో ప్రణాళికాయుతంగా నిర్మాణాలు జరిగేలా చూస్తానన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఆదిపురుష్	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ది ఫ్లాష్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
ఆదిపురుష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 22 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ నెగిటివ్ 1 యూనిట్, ఏబీ పాజిటివ్ 2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

స్కూల్ సెలవులకు వినతి



డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందిస్తున్న భానుమూర్తియాదవ్

అనకాపల్లిటౌన్ : ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో పాఠశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో ఈ నెల 25 వరకూ పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్ కోరారు. డీఈవో కార్యాలయంలో ఈ మేరకు డీఈవో వెంకటలక్ష్మమ్మకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 15 రోజుల నుంచి ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఉక్కపోత అధికంగా ఉండడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచే రోడ్లపైకి రావాలంటే అన్ని వర్గాల ప్రజలు భయపడిపోతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కాళ్ల వెంకట సత్యనారాయణ, సేనాపతి రాజు, కె.వి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవంలో బందోబస్తుకు వినతి



సీఐ దాడి మోహన్‌కు వినతిపత్రం అందిస్తున్న పీలా రాంబాబు

అనకాపల్లిటౌన్ : జగన్నాథస్వామి రథయాత్రలో పోలీస్‌బందోబస్తును ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ 81వ వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు కోరారు. ఈ మేరకు పట్టణ సీఐ దాడి మోహన్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ నెల 20న జరిగే రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దాడి ఈశ్వరరావు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, కోదండపాణి, పలకా కాసులు, మళ్ల రామచంద్రరావు, కొణతాల పరదేశినాయుడు, పొలిమేర ఓంకార్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచ్ నాగేశ్వరరావు

తుమ్మపాల : మండలంలోని వెంకుపాలెంలో అరబిందో సీఎస్సార్ నిధులతో చేపడుతున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థానిక ఎంపీపీ గొర్లి సూరిబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల అభ్యర్థనను మన్నించి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేసిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.80 లక్షలతో ఈ నిర్మాణం జరగనుందన్నారు. అతి త్వరలో పనులు పూర్తిచేసి గ్రామస్తుల వినియోగానికి సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల 181వ ఊంజల్‌సేవ



ఊంజల్‌సేవలో సంతోష్, రామలక్ష్మి దంపతులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం శ్రీగౌరీపంచాయతన దేవస్థానంలో గౌరీపరమేశ్వరుల 181వ ఊంజల్‌సేవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి, వేదపండితులచే నిర్వహించారు. పెంటకోట బాలకృష్ణ, శకుంతల, కుమారుడు సంతోష్, రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఉంజల్‌సేవ జరిగింది. దేవస్థానం అధ్యక్షుడు సన్యాసినాయుడు, కార్యదర్శి రమణాజీ, కోశాధికారి శివసూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలు



టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సత్కారం



హెచ్ఎం రుధిరారాణిని సత్కరిస్తున్న సూరిబాబు, విష్ణుమూర్తి

అనకాపల్లిటౌన్ : బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలో అందించేందుకు సీఎం జగన్ ఎంతగానో కృషి చేస్తున్నారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.సుజాత తెలిపారు. ఈ ఏడాది టెన్త్, ఇంటర్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరిట శుక్రవారం సత్కరించారు. స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విద్య కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని వివరించారు. కార్పొరేటర్లు ప్రసన్నలక్ష్మి, లక్ష్మీసౌజన్య మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాల ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రభుత్వం నగదు ప్రోత్సాహంతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలల్ని సీఎం జగన్ అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి మాట్లాడుతూ మనిషి వ్యక్తిత్వాన్ని మార్చేది విద్యేనని, విద్య ద్వారా ఆ వ్యక్తి భవిష్యత్ ముడిపడి ఉంటుందన్నారు. అంతకుముందు నియోజకవర్గంలో టెన్త్‌లో ప్రథమస్థానంలో నిలిచిన దోసూరు హన్షితకు రూ.15 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన పూడి పూర్ణిమకు రూ.10 వేలు, తృతీయస్థానంలో నిలిచిన సీహెచ్ రేణుకఅమృతకు రూ.5వేలు, ఇంటర్మీడియట్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన కె.భాగ్యశ్రీ(ఎంపీసీ), ఎన్.సత్యశ్రీ(బైపీసీ), సీహెచ్ షణ్ముఖి(ఎంఈసీ)లకు రూ.15 వేలు చొప్పున నగదు ప్రోత్సాహం అందించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో చదివి, టెన్త్ ఫలితాల్లో ఉత్తమంగా నిలిచిన 23 మంది విద్యార్థినులను ప్రముఖ వ్యాపారస్తుడు భాస్కరరావు ఆర్థిక సాయంతో నగదు ప్రోత్సాహం అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి, 20 మందికి రూ.500 చొప్పున నగదు బహుమతులిచ్చారు. హెచ్ఎం రుధిరాణిని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో దివాకర్, హెచ్ఎం రుధిరాణి, వైఎస్సార్ సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, పార్టీ నేత ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నియంత్రణపై అవగాహన



తుమ్మపాల పీహెచ్‌సీలో లెప్రసీ రోగులకు చెప్పులు అందిస్తున్న డాక్టర్ వాణీజగదీశ్వరి

తుమ్మపాల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో కుష్టు వ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్.వాణీజగదీశ్వరి ఆరుగురు రోగులకు ఎంసీఆర్ చెప్పుల్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా, ఏఎన్ఎంల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నట్టు తెలిపారు. వ్యాధి నివారణకు తగిన సూచనలు, మందులు కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో డి.శారద, ఎంపీఈహెచ్‌వో జి.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్‌లు బి.సంగమ్, ఎం.మాణిక్యాంబ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉమా సాంబశివుల కల్యాణం



కశింకోటలోని కస్పావీధిలో ఉమా సాంబశివుని కల్యాణోత్సవంలో వేద పండితులు, భక్తులు

కశింకోట : స్థానిక కస్పావీధిలో వెలసిన ఉమా సాంబశివుని ఆలయంలో శుక్రవారం రాత్రి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాంబశివుడు, ఉమాదేవిల ఉత్సవ విగ్రహాలను పూలు, ఆభరణాలతో అలంకరించి శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ వేదపండితులు కొడుకుల బాలకృష్ణ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలను ఘనంగా జరిపించారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగితేలారు. స్వామి వారి ఆలయంలో ప్రధాన లింగరూప స్వామిని అందంగా పూలతో అలంకరించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగనన్న కాలనీలో వీధి దీపాలు



లేఅవుట్‌లో వీధిలైట్లు ప్రారంభిస్తున్న లగిశెట్టి గణేష్

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీలో వీధి దీపాలు శుక్రవారం ప్రారంభించారు. కాలనీలో స్తంభాలు ఏర్పాటు చేసి, విద్యుత్ లైన్లు గతంలో వేశారు. తాజాగా వీధి లైట్లను అమర్చారు. వీటిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ స్విచాన్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చొరవచూపిన ప్రభుత్వానికి, స్థానిక నేతలకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నాగదుర్గమ్మా.. నమోస్తుతే!

- ఘనంగా బెల్లం మార్కెట్ నాగదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం
- సారె తెచ్చిన సతకంపట్టు కనకదుర్గ, వేల్పుల వీధి గౌరీపరమేశ్వరుల ఆలయ కమిటీ ప్రతినిధులు



సారెతో గౌరీపరమేశ్వరుల ఆలయ కమిటీ



నాగదుర్గమ్మ సన్నిధిలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, రవి దంపతులు, సీఐ రవికుమార్

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో నాగదుర్గమ్మ ఆలయ 20వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ పలకా యశోద రవి దంపతులు, రూరల్ సీఐ రవికుమార్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు తీవ్రత నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బుద్ధ నాగేశ్వరరావు, కార్యదర్శి పాలమరశెట్టి కాళిదాస్, కోశాధికారి దాడి పరదేశినాయుడు, కొలగార్ల సంఘం, గుమస్తాల సంఘం, కార్మికుల సంఘం, శ్రీ కనకదుర్గమ్మ కమిటీ, ఎన్టీర్ బెల్లం మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాగదుర్గమ్మకు సారె సమర్పణ

గవరపాలెం సతకంపట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ ఆధ్వర్యంలో గవరపాలెం మహిళలు వివిధ రకాలైన పిండివంటకాలను ఊరేగింపుగా తీసుకువచ్చి మార్కెట్ యార్డులో నాగదుర్గమ్మకు సారె సమర్పించారు.

వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు కూడా సంప్రదాయంగా నాగదుర్గమ్మకు సారె తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దాల కూర్మరావు, మద్దాల నూకరాజు, గరికి వెంకటరావు, శీరంశెట్టి నర్సింగరావు, ముత్తా శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

'కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి'



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఫణీంద్ర

తుమ్మపాల : ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని కోడిగంటి గోవిందరావు భవనంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిబంధనలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, విద్యాసంస్థల దోపిడీని నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సతీష్, సభ్యులు గణేష్, రాజు, రవి పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ధర్నా



పూడిమడక రోడ్డు మరమ్మతుల కోసం ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తుమ్మపాల : అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక జేఎంజే పాఠశాల సమీపంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ గోతులమయంగా మారిన రహదారికి మరమ్మతులు చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు స్పందించట్లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.ఎస్.సన్యాసిరావు, జి.దేముడుబాబు, వియ్యపు రాజు, కోరిబిల్లి శంకరరావు, నరాలశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.